పచ్చపావడా

కె.లలితాచలం

"పండగొస్తుంది, అమ్మాయినీ, అల్లుడ్నీ తీసుకురా" అంది అమ్మ నాన్నతో. పండగన్న మాట వినగానే ముసిముసిగా నవ్వుకుంటూ మురిసిపోయింది మువ్వ. సంతోషం పట్టలేక ఉబ్బి తబ్బిబ్బయి పోయింది. మువ్వకి పండగంటే సంబరం. తనని కిందటి సంవత్సరం బళ్ళో చేర్చేటప్పుడు అమ్మ చెప్పింది, "చక్కగా పంతులు చెప్పినట్లు చదువు కోవాలి. బాగా చదువుకుంటే నీకు పచ్చ పావడా కొంటాను" అని.

మువ్వకి పచ్చపావడా అంటే ఎంతో ఇష్టం. మువ్వ బళ్ళో చేరాక అక్షరాల కంటే తొందరగా మూడు నాలుగు పండుగలొచ్చేశాయి. ఒక పండక్కి అమ్మ "డబ్బులు లేవే మువ్వా, మళ్లొచ్చే పండక్కి పచ్చపావడా కొంటాగా!" అంది చీరకి మాసికలు కుట్టుకుంటూ. మళ్ళీ పండగ పైసలకోసం ఆగకుండా చకచకా వచ్చేసింది. కాని మువ్వ పచ్చపావడా కొనడానికిదాచినడబ్బంతా ఇల్లంతా కురుస్తున్న వానకి గొడుగుగా తాటాకులు కొనడానికే సరిపోయాయి.

వాన కురిస్తే నీ పచ్చపావడా తడిసి పోతుందని ఇల్లు కప్పుతున్నాడు అయ్య. మళ్ళీ పండక్కి పావడా కుట్టిస్తాగా!" అంది అమ్మ మువ్వని బుజ్జగిస్తూ. మువ్వకి పచ్చపావడా తడిసిపోతుందని భయమేసింది. అందుకే అమ్మతో మరి ఆ పావడా సంగతి అనలేదు. పండగ కోసం. పావడాకోసం ఎదురు తెన్నులు చూసింది మువ్వ. మరో పండగ వచ్చింది. అప్పుడు మువ్వకి చాలా జ్వరం వచ్చింది. అప్పుడే అక్కకి కూడా పెళ్లైపోయింది. అక్కంటే మువ్వకి ఎంతో ఇష్టం — జ్వరం తగ్గే టప్పటికి బావ అక్కని, తీసుకుని ఊరెళ్ళిపోయాడు. బావంటే మువ్వకి చాలా కోపం వచ్చింది. అక్క వెళ్ళి పోయినందుకు దిగులు దిగులుగా అనిపించింది. ఆ దిగులుతో మువ్వ కొన్ని రోజులు పావడా మాటే మరిచిపోయిం

చాలారోజుల తరువాత మళ్ళీ ఆ చిన్నారికి పావడా మాటే జ్ఞాపక.
పండగొస్తోందని మువ్వ తల్లి చెప్పగానే, మొచ్చింది. గంతులు వేసుకుంటూ తల్లి

దగ్గరకు వచ్చింది. తల్లివంక బిక్కు బిక్కుమంటూ చూసింది. "అడగనా ? వద్దా ?" అన్నట్టుగా కొంచెం బెరుకు బెరుకుగా చూసింది. ఆగలేక, అణచుకో లేక అమ్మని అడిగేసింది. "అమ్మా ! పండక్కి పచ్చపావడా కొనవే" అని. అమ్మ ఏమని చెపుతుందో ! అని ఒళ్ళంతా చెవులు చేసుకుని రిక్కించి వింది. అమ్మ, మువ్వని దగ్గిరగా తీసుకుని ముద్దుపెట్టుకుని ముఖాన పడుతున్న చింపిరి వెంట్రుకలు సవరిం చింది. చిన్నగా నవ్వి,

"కొంటాలే. పచ్చపావడా తెమ్మని సాలెనరసిమ్మతో చెప్పాలే!" అంది. స్వాతి వానకోసం ఎదురు చూస్తున్న ముత్యపు చిప్పలా సంతోషంతో అమ్మ ఒళ్లో తల దూర్చేసింది మువ్వ గువ్వలా ముడుచుకుపోతూ.

"మరి పండక్కి అక్కా బావా, అత్తా మావా అందరూ వస్తారు. అప్పుడు ...." అమ్మ ఏవేవో చెప్పుకు పోతోంది. కాని మువ్వ చెవులకు అవేమీ వినిపించటంలేదు.

కళ్ళముందు పచ్చపావడా వచ్చి నిలిచింది. అమ్మ చెప్పిన మాట, ఆళమ్మ అమ్మే జీడిముక్కలాగా తియ్యగా అనిపించింది. గుడిగంటలు ఆగకుండా మోగుతున్నట్లనిపించింది. ఎంతో ఎత్తున కట్టిన గుడిగంటలు తను ఎగరకుండానే కొడుతున్నట్లుగా అనిపిం చింది. పూజారి పంతులు అడక్కుండానే ప్రసాదం పెట్టినంత సంబరపడి పోయింది మువ్వ. పరుగు పరుగున వెళ్ళి తన తోటి పిల్లలందరికీ చెప్పొచ్చే సింది. తనకు పచ్చపావడా రాబోతోం దని గర్వంగా కళ్ల పెద్దవి చేసి చక్రాల్లా తిప్పుతూ చెప్పింది. మువ్వ కళ్ళలో పచ్చపావడా నాట్యం చేసింది. తనకు అమ్మ పచ్చపావడా కొన్నట్లూ, తను ఆ పావడా కట్టుకున్నట్టుగా, అందరూ తననీ తన పావడానీ చూస్తు న్నట్లుగా మురిసిపోయింది గర్వంగా. పండుగకోసం, పావడాకోసం ఎదురు చూస్తోంది మువ్వ.

పండగ వస్తోందని, అమ్మ బూజులు దులిపింది. గోడలు మెత్తింది. ఈతాకుల చీపురు సున్నంలో ముంచి, వెల్లవేసింది. మువ్వ పేడ పోగుచేసుకొచ్చింది. అమ్మ ఇల్లంతా అలికింది. మువ్వ ముగ్గుగుల్ల తెచ్చింది. అమ్మ ఇల్లంతా చిగురు కొట్టింది. ముగ్గులు పెట్టింది. ఇల్లంతా పూసిన పూచ్చపొదులాగా ఉంది.

మువ్వకనులలో కలలలో తిరిగే పచ్చ పావడా ఇలలోకి వచ్చింది. మువ్వ ముందు నిలిచింది. అమ్మ చేతులో కొచ్చింది. అమ్మ బొందు పావడా కుట్టింది చేత్తో. మువ్వ అమ్మవంక, పావడా వంక, మార్చి మార్చి చూసింది. ఆ కళ్ళలో ఏదో తెలియని వింత కాంతి.

"పావడా వేసుకుంటే ఎంత

బాగుంటుందో !" అనుకుంది. మువ్వ, పావడా వంక ఆశగా చూస్తూ అమ్మ పక్కనే కూచుంది. మునివేళ్ళతో పావడా నలిపి తృప్తిపడింది. "కుదుతూ కుదుతూ అమ్మ పావడా పక్కకి పెడితే బాగుండును. దబుక్కున తొడుక్కొని చూడొచ్చు" అనుకుంది మువ్వ. కాని అమ్మ వెళ్ళలేదు. పావడా కుట్టి చెక్కపెట్టెలో పెట్టి గొళ్ళెం పెట్టింది. "పండుగనాడు తొడుక్కుందువుగాని ఏం" అని వెళ్ళిపోయింది.

"ఇంకా పండగెప్పుడే !" అంది మువ్వ అమ్మ వెనకాలే వెడుతూ. పండగని తిట్టుకుంటూ.

"అక్క, బావ వచ్చాక" అంది అమ్మ. అక్క వస్తోందనగానే పండగ మీద కోపం ఎగిరిపోయింది.

పండ గొచ్చేసింది. నాన్న, అక్కనీ బావనీ వెంటబెట్టుకుని వచ్చాడు. అక్క పొట్ట పెద్ద బానలా ఉంది. మువ్వకి నవ్వొచ్చింది అక్కని చూస్తే. కాని, అమ్మ చెప్పింది అక్కకి దేముడు పాపాయిని ఇస్తాట్ట. పాపాయంటే మువ్వకి చాలా ఇష్టం. అందుకే అక్క బుగ్గమీద పెద్ద ముద్దుపెట్టింది సంబరం పట్టలేక. అత్తా, మావా కూడావచ్చారు. అందరూ ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు. నవ్వుకున్నారు.

అక్కకీ, అత్తకీ, బావకీ, మావకీ మువ్వ పావడా చూపించింది. అమ్మ ఎప్పుడు పావడా కట్టుకోమంటుందా ! అని ఇల్లు వదలకుండా అమ్మ కొంగు పట్టుకునే తిరిగింది మువ్వ.

నాన్న మామిడి కొమ్మలు తెచ్చాడు. గుమ్మాలకి తోరణాలు కట్టాడు అత్త గుమ్మానికి పసుపు పూసి తెల్లబొట్లు పెట్టింది. అక్క వాకిట్లో కళ్ళాపి జల్లింది. ఒంగలేకపోయినా, నక్షత్రాల్లా చుక్కలు పెట్టి ముగ్గులు కలిపింది. ముద్దబంతులు, ఊకబంతులు ఒడినిండా కోసుకొచ్చింది మువ్వ. అత్త దండలు గుచ్చింది అమ్మ, అక్కకీ అత్తకీ తల దువ్వి ముడివేసింది. మువ్వకి సవరం పెట్టి బంతిపూల జడ వేసింది. మెటిక విరిచి ముద్దుపెట్టుకుంది. నాన్న, బావ, మావయ్య ప్రమిదల్లో ఒత్తులు వేశారు. అక్క, అత్త, అమ్మ నూనె పోశారు. వెలిగించారు. అమ్మ దేముడికి పూజ చేసింది. దేముడికి పిండివంటలు పెట్టింది. అందరికీ కొత్తబట్టలు ఇచ్చి తను కూడా కట్టుకుంది.

మువ్వ పచ్చపావడా కట్టుకుని, పసుపుపచ్చని ముదిరవిక తొడుక్కుంది. తనను తాను పదే పదే చూసుకుని మురిసిపోయింది. ఆ దీపాల వెలుగులో ఇల్లంతా తిరిగింది. వీధంతా తిరిగింది. ఆడింది, పాడింది. పరవశించిపోయింది మురిపాల మువ్వ.

బావ టపాకులు కాల్చాడు. మువ్వకి

టపాకులన్నా చీకటన్నా, బూచాడన్నా చాలా భయం. అందుకే జీర్ణాడే పచ్చ పావడాని చేత్తో ఎత్తికుని దూర దూరంగా నిలబడింది. మువ్వ తలలో బంతులు, నల్లరేగడి గట్టున పూసిన బంగారు పువ్వుల్లా మెరిసిపోయాయి. నిండుపంటకు ఒరిగి ఊగుతున్న పంట చేనల్లే, నిండు చూలాలల్లే మువ్వ, పావడా బరువు మోయలేక బరువుగా నడుస్తుంటే, ఇంటిల్లిపాదికీ అమ్మవారల్లే కనిపించింది మువ్వ.

ఊరంతా పండగ. ఇంటింటా పండగ. ఎవరి కన్నుల్లో చూచినా ఆనందోత్సాహాలే. ప్రతిచోట, ప్రతి ఇంట, దీపాల తోరణాలు. ప్రతి మనసులో సంతోషం ఎగిరి ఎగిరి పడుతోంది సముద్రంలా.

అలనాడు సత్యభామ నరకాసురుణ్ణి చంపిందో లేదో! కాని, ఈనాడు తామే సత్యభామలైనట్లు, ఆ నరకాసురుణ్ణి తామే చీల్చి చెండాడినట్లుగా సంబరపడి పోయారు జనం. దీపావళి వెళ్ళి వారం అయినా వచ్చిన చుట్టపక్కాలతో ఇళ్ళు కళకళలాడుతూనే ఉన్నాయి. ఆ సంబరం తరగటంలేదు. ఎక్కడ చూచినా చిటచిటలు, పటపటలు.

మువ్వకి ఊరి సంబరం పట్టటం లేదు. తన లోకమే తనది. పచ్చ పావడా కట్టుకుని, గిరగిరా తిరిగి పావడాని బుట్టలాగా చేసి, అందులో కూచుని కిలకిలా నవ్వుతూ మైమరచి పోతోందిమువ్వ. ఆ పసికూల ఆనందానికి అవధులు లేవు మువ్వకి పావడాయే ప్రాణం.

పండుగ వెళ్ళి వారం వెళ్ళింది కాని అక్కా బావా, అత్తా మావా వెళ్ళలేదు. ఇల్లంతా సందడి. మనసంతా సంబరం. మువ్వ పావడా వారం తిరిగినా మువ్వని వదిలి నీటిముఖం చూడలేదు. మువ్వనే చుట్టుకుపోయింది. పావడాకి కూడా మువ్వంటే ప్రాణం కాబోలు.

చీకటి చుట్టుముట్టింది కారుబొగ్గులా. ఇంటింటి ముంగిటా దీపాలు వెలిగాయి.

అక్కడక్కడా ఇంకా టపాకుల ధుమధుమలు, చిటపటలు వినిపిస్తూనే ఉన్నాయి.

రివ్వున గాలి వీచింది. దీపాలన్నిటినీ ఆర్పేసింది. కారుచీకటి కమ్మేసింది. వాకిట్లో ఆడుకుంటున్న మువ్వకి భయం వేసింది. మెరుపు మెరిసి మాయమైంది. ఆ మెరుపు వెలుగులో ఏదో భయంకర మైన ఆకారాన్ని చూసింది మువ్వ. అమ్మ చెప్పిన బూచాడు జ్ఞాపకం వచ్చాడు. అంతే, మువ్వ భయంతో కెవ్వున కేకేసింది. "అమ్మా ! బూచాడు. నాన్నా! బూచాడు ఎత్తుకు పోతున్నాడు," అంటూ అరిచింది. ఆ కేక అందరికీ వినిపించింది. ఇంటిల్లి పాదికీ వినిపించింది. మువ్వ తండ్రి పరుగు పరుగున వాకిట్లోకి వచ్చాడు.

కలియుగ సీత



కళ్ళు పొడుచుకుని చీకట్లోకి చూశాడు. చిట్టితల్లికోసం తడిమి చూశాడు. ఆ చీకట్లో దారీ తెన్నూ తెలియకుండా పిచ్చివాడిలాగా అటూ ఇటూ ఎటో పరుగులెత్తాడు, "మువ్వా మువ్వా" అంటూ. తాను వెలిగించిన దీపాలు తన కాళ్ళతోనే తొక్కాడు. తన ఇంటి ముందు ముగ్గు తొక్కాడు. తన చేతులతో ప్రేమగా పెంచిన మొక్కలు కస∶సా కాళ్ళతోనే తొక్కి చంపేశాడు. 'మువ్వా, చిట్టితల్లీ!' అంటూ దిక్కులు పిక్కటిల్లేలాగా అరుస్తూ, ఆయాస పడుతూ, లేస్తూ పరుగులు తీశాడు. ఎక్కడో, "నాన్నా! నాన్నా" అన్న ఆర్తనాదం వినిపిస్తూనే తండ్రి కూతుళ్ళ మధ్య దూరం పెరిగిపోయింది.

వెలుగు చీకటిని మింగేస్తే, చీకటి వెలుగుని కప్పేస్తుంది. అది వారిద్దరి మధ్య కలకాలంగా జరుగుతున్న దోబూచులాట. చీకటిని చప్పరించి మింగేస్తూ వెలుగు తొంగి చూసింది. ఫక్కున తెల్లవారింది. మూసుకున్న కళ్ళు తెరిపించింది. ముందున్నది చూడ మన్నది. వెలుగును చూస్తే అందరికీ ఏదో ధైర్యం.

"రాత్రంతా ఎంత భయంతో గడిపిందో చిట్టితల్లి మువ్వ. తెల్లవారు తూనే ఒళ్ళు కదిలించింది. నెమ్మదిగా "అమ్మా" అంటూ మూలిగింది. ఒళ్ళంతా బరువు. ఒణుకు, భయం. కొద్దికొద్దిగా కళ్ళు తెరిచి చుట్టూ కలయ చూసింది మువ్వ. అదంతా కొత్త

ప్రదేశం. అది తను చిన్నప్పటినుంచీ తిరిగినచోటు కాదు. తను ఎంతో ప్రేమతో పెంచిన ముద్దబంతులు లేవు. అక్క పెట్టిన ముగ్గూ, అత్త దిద్దిన పసుపు కుంకం, నాన్న కట్టిన తోరణాలు, మావపెట్టిన దీపాలు అసలే లేవు. "మరి నే నెక్కడున్నాను? బూచాడింట్లోనా?" బూచాడు తలపులో కదలాడగానే మువ్వకు మరీ భయం వేసింది. గజగజలాడిపోయింది. గట్టిగా కళ్ళు మూసుకుని, పెద్దగా ఏడ్చింది. ఇంతలో పచ్చపావడా జ్ఞాపకం వచ్చింది కాబోలు నడుం దగ్గర తడిమి చూసుకుంది తన చిట్టిచేతులతో. పావడా చిరిగిపోయింది. పీలికలు వాలికలై పోయింది. మువ్వకు దుఃఖం ఆగలేదు. ఎలా? అమ్మ ఇచ్చిన కొత్తపావడా చిరిగిపోయింది. అమ్మ కొడితే? అమ్మ దగ్గరకు వెళ్ళడం ఎలా? పారిపోతా! అమ్మ దగ్గిరకి పోతా! వెక్కి వెక్కి ఏడ్చింది. పారిపోవాలని పెనుగులాడింది. మువ్వని ఎవరో కట్టేశారు. "అమ్మా! అమ్మా!" అంటూ చాలాసేపు ఏడ్చింది. అలసిపోయింది మువ్వ. ఆకలేసింది. నెమ్మదిగా కళ్ళు నులుముకుని చుట్టూ చూసింది, కొంచెం ధైర్యం తెచ్చుకుంటూ.

తను చాలా ఎత్తున ఉన్నట్లుగా అనిపించింది. కిందకు చూసింది మువ్వ. అంతా జలమయం. దూరంగా మనుషులు కనిపించారు. అమ్మకోసం, నాన్నకోసం గొంతెత్తి పిలిచింది. చేతులు చాచింది. వత్తులు ఆరిపోయిన ప్రమిదల్లాగా జీవంలేని ఎన్నో శరీరాలతోపాటు అమ్మా నాన్నా కూడా మువ్వ కళ్ళ ముందునుంచే ప్రవాహంలో కొట్టుకుపోయారు. మువ్వతల్లిని మాత్రం పచ్చపావడా రక్షించింది. తాను చెట్టు కొమ్మకు చిక్కుకుని, మువ్వను తను గట్టిగా నడుముకు కౌగిలించుకుని పట్టుకుంది. మువ్వకు మిగిలింది పీలికలు వాలికలైన పచ్చపావడా. పచ్చపావడాకు మిగిలింది మువ్వ. వారిద్దరి అనుబంధం ఏనాటిదో!